పేదల సంక్షేమమే సర్కారు లక్ష్యం

● భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్, సెప్టెంబర్ 2 : పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 నెలల్లోనే అనేక అభివృద్ధి పనులు చేసినా.. ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకనే బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోలి పింగళ్‌రెడ్డి, శ్యామ్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, సత్తిరెడ్డి, వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీఓ అమరేందర్

మోటకొండూరు : చందేపల్లి కమ్యూనిటీ హాల్‌లో ఉన్న వారితో మాట్లాడుతున్న ఆర్డీఓ అమరేందర్

మోటకొండూర్, సెప్టెంబర్ 2 : మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ అమరేందర్ అన్నారు. మండలంలోని చందేపల్లిలో శిథిలావస్థలో ఉన్న ఇంట్లో నివాసముంటున్న కుటుంబాన్ని అధికారులు కమ్యూనిటీ హాల్‌కు తరలించారు. వారిని సోమవారం ఆర్డీఓ కలిసి మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని కొండాపూర్‌లో ఉధృతంగా ప్రవహిస్తున్న బిక్కేరు వాగును పరిశీలించారు. వరద ఉధృతి తగ్గిన తరువాతే బారికేడ్లను తొలగించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తాసీల్దార్ శాంతిలాల్, ఎంపీడీఓ ఇందిర, ఎంపీఓ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి భవానీ పాల్గొన్నారు.

నీటి ప్రవాహం పరిశీలన

అడ్డగూడూరు : మండలంలోని చిర్రగూడూరు, చౌళ్లరామారం గ్రామాల మధ్య నీటి ప్రవాహాన్ని ఆర్డీఓ పి.అమరేందర్ పరిశీలించారు. ప్రస్తుతం నీటి ప్రవాహం ఏమీ లేదని, మళ్లీ వర్షం పడితే వాహనాల రాకపోకలను నిలిపివేసి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట తాసీల్దార్ శేషగిరిరావు, మండల ప్రత్యేకాధికారి కృష్ణ ఉన్నారు.

బేగంపేట వాగును పరిశీలించిన డీపీఓ

బేగంపేట వాగును పరిశీలిస్తున్న డీపీఓ సునంద

రాజాపేట, సెప్టెంబర్ 2 : మూడ్రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండంతో మండలంలోని బేగంపేట వాగును జిల్లా పంచాయతీ అధికారి సునంద సోమవారం పరిశీలించారు. వాగులో బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతుండంతో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మండల అధికారులకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలను సందర్శించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీఓ నాగవేణి, ఎంపీఓ కిషన్ ఉన్నారు.

కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్ పెంచాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌కుమార్

అదనపు కలెక్టర్ గంగాధర్‌కు వినతి పత్రం ఇస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 2 : కులగణన చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం అదనపు కలెక్టర్ గంగాధర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో కుక్కలు, నక్కలు, పశుపక్షాదులకు లెక్కలు ఉన్నాయి కానీ.. దేశ జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు లెక్కలు లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఎన్నికల హామీ మేరకు బీసీల సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్ పెంచేందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త నరసింహస్వామి, జిల్లా నాయకులు సాయిని నరేందర్, బొజ్జ సాంబేశ్, అశోక్‌చారి, ఆర్కే, సత్తమ్మ పాల్గొన్నారు.

సీతారామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

పూజల్లో పాల్గొన్న మున్సిపల్ వైర్మన్ రాజు, భక్తులు

చౌటుప్పల్, సెప్టెంబర్ 2 : శ్రావణ మాసం చివరి రోజు సోమవారం పట్టణంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర లింగార్చన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్‌నాయక్, వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, ఆలయ చైర్మన్ బొబ్బిళ్ల మురళి, భక్తులు పాల్గొన్నారు.

పచ్చలకట్ట సోమేశ్వరాలయంలో పూజలు

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 2 : శ్రావణ మాసం చివరి రోజు అమావాస్య సందర్భంగా పట్టణంలోని పచ్చలకట్ట సోమేశ్వరాలయంలో సోమవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 17వ వార్డు కౌన్సిలర్ చెన్న స్వాతీమహేశ్ ఆర్థిక సహకారంతో స్వామివారికి అన్న పూజ, ప్రత్యేక పూజలు, అన్నదానం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

దొంగతనాల పట్ల జాగ్రత్తగా ఉండాలి : ఎస్ఐ

ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఆలేరు రూరల్, సెప్టెంబర్ 2 : ప్రయాణికులు దొంగతనాల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ రజనీకర్ అన్నారు. ఆలేరు పట్టణంలోని బస్టాండ్‌లో సోమవారం ప్రయాణికులకు దొంగతనాల నుంచి కాపాడుకునేందుకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు తమ ఒంటిపై ఉండే ఆభరణాలు బయటికి కన్పించకుండా జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. రద్దీగా ఉండే బస్సులను ఎక్కేటప్పుడు జేబులో ఉండే పర్సులను, సెల్‌ఫోన్లను దొంగతనం చేస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది నవీన్, యాకుబ్‌పాషా, గోవర్ధన్, కల్యాణ్‌రాజ్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి తిరు కల్యాణోత్సవం

ఆలయంలో ఏపీ లోకాయుక్త లక్ష్మణరెడ్డికి స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 2 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరు కల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. సోమవారం ఉదయం మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరుకల్యాణ తంతును జరిపారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి వెండి మొక్కు జోడు సేవ, దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. అనుబంధ రామలింగేశ్వరస్వామి ప్రధానాలయంలో పరమశివుడు, స్పటిక లింగేశ్వరుడికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం చేపట్టారు. సుమారు 8వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.15,84,978 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

స్వామివారిని దర్శించుకున్న ఏపీ లోకాయుక్త

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. సోమవారం యాదగిరి కొండకు చేరుకున్న ఆయనకు ఆలయ అర్చకులు సంప్రదాయ స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులు, అర్చకులు వేదాశీర్వచనం చేయగా, ఆలయ ఈఓ భాస్కర్‌రావు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

గణేశ్ ఉత్సవాలపై నేడు సమావేశం

రాజాపేట, సెప్టెంబర్ 2 : వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వహణపై మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉత్సవ కమిటీ, వివిధ రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన సమావేశం నిర్వహిస్తున్నట్లు తాసీల్దార్ దామోదర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించే సమావేశానికి మండల స్థాయి అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

గుడి గంటల చోరీకి యత్నించిన వ్యక్తిపై కేసు

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 2 : పట్టణంలోని రాయగిరి గ్రామంలో దుర్గామాత ఆలయంలో గుడి గంటలను దొంగిలించేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ వి.సంతోష్‌కుమార్ తెలిపారు. బొమ్మలరామారం మండలం పిల్లిగుండ్లతండాకు చెందిన ధీరావత్ శంకర్ రాయగిరి కమాన్ వద్ద ఉన్న దుర్గామాత ఆలయంలోని ఇత్తడి గుడి గంటలను విప్పేందుకు ప్రయత్నించాడు. గమనించిన ఆలయ పూజారి కొట్టం రేణుక కేకలు వేసింది. దీంతో పారిపోయేందుకు ప్రయత్నించిన దుండగుడిని గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆలయ పూజారులు, గ్రామస్తుల ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీసులపై దాడికి యత్నించిన వ్యక్తికి రిమాండ్

గుండాల, సెప్టెంబర్ 2 : మద్యం మత్తులో పోలీసులను దూషించి దాడికి యత్నించిన వ్యక్తికి 12రోజుల రిమాండ్ విధిస్తూ సోమవారం భువనగిరి కోర్టు ఉత్తర్వులు వెలువరించింది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని బండకొత్తపల్లి గ్రామానికి చెందిన నల్లగొండ రమేశ్ గ్రామంలో ఇటీవల జరిగిన బోనాల పండుగలో తన ట్రాక్టర్‌ను అధిక వేగంతో నడుపుతూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తుండగా.. అక్కడే ఉన్న పోలీసులు నెమ్మదిగా నడుపాలని సూచించారు. మద్యం మత్తులో ఉన్న రమేశ్ పోలీసులను దూషిస్తూ వారిపై దాడికి యత్నించాడు. కానిస్టేబుల్ మధుకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు రమేశ్‌పై కేసు నమోదు చేశారు. సోమవారం భువనగిరి కోర్టులో హాజరు పరుచగా.. 12 రోజుల కస్టడీ రిమాండ్‌కు కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దాంతో రమేశ్‌ను భువనగిరి జైలుకు తరలించినట్లు ఎస్ఐ సైదులు తెలిపారు. ఎవరైనా చట్ట పరిధిలోనే వెళ్లాలని, చట్ట విరుద్ధ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి : సీపీఎం

మోత్కూరు, సెప్టెంబర్ 2 : వరుసగా కురుస్తున్న వానలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు కోరారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు ఇప్పటికే విషజ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన మందులను అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు దడిపెల్లి ప్రభాకర్, కురి మేటి యాదయ్య, సైదులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

బీబీనగర్, సెప్టెంబర్ 2 : ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన బీబీనగర్‌లో గత నెల 30న చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లి గ్రామానికి చెందిన మేడిపల్లి రాజయ్య ఆగస్టు 30న బీబీనగర్ మండలం గూడూరు గ్రామంలోని తన కూతురు ఇంటికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వచ్చాడు. రాజయ్య కూతురి ఇంటికి రాలేదు. ఆయన సెల్‌కు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుంది. కుటుంబ సభ్యులు బంధువుల ఇండ్లల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం రాజయ్య కుమారుడు యాదగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్వర్ణగిరిలో పంచకలశ స్నపన తిరుమంజనం

పద్మావతి అమ్మవారికి పంచకలశ స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్య పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం 5:45 గంటలకు స్వామివారికి నిత్యారాధన పురస్కరించుకొని అర్చక స్వాములు వేదమంత్రాలతో సువర్ణ బిందె తీర్థాన్ని బంగారపు బావి నుంచి తీసుకొచ్చారు. స్వామివారికి వేయి నామాలను స్తుతిస్తూ సహస్రనామార్చన నిర్వహించారు. శ్రావణ మాసం సందర్భంగా పద్మావతి అమ్మవారికి పంచకలశ స్నపన తిరుమంజనం నిర్వహించారు. పద్మావతీ, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామిని మణిమయ వజ్ర శోభిత స్వర్ణ ఆభరణాలతో, సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించారు. శ్రీవారి వైభవోత్సవ మండపంలో కొలువుదీర్చి.. నిత్య కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. సాయంత్రం 6:30 గంటలకు స్వామివారిని మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు గోవిందనామాలను పటిస్తూ.. మేళతాళాల మధ్య వేదమంత్రోచ్చారణలతో స్వర్ణ గిరీషుడికి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం సహస్ర దీపాల మధ్య ఉన్న ఊయలలో స్వామివారు ఉభయ దేవేరుల సమేతంగా ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితులు వేదమంత్రాలతో స్వామివారిని కీర్తించి సుస్వరంగా నాదస్వరాన్ని వినిపించారు.

'విద్యుత్ సౌధ ముట్టడిని విజయవంతం చేయాలి'

ముట్టడి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 2 : విద్యుత్ బీసీ, ఓసీ ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో బుధవారం చేపట్టే విద్యుత్ సౌధ ముట్టడి, మహాధర్నాను విజయవంతం చేయాలని బీసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి మురళి అన్నారు. పట్టణంలోని విద్యుత్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో సోమవారం ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యుత్ ఓసీ, బీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలన్నారు.

కార్యక్రమంలో సీనియర్ అకౌంట్ ఆఫీసర్ బాలచంద్రుడు, నాయకులు భూపాల్‌రెడ్డి, విజయారెడ్డి, శ్రీదేవి, రవికుమార్, వెంకటేశ్, సిద్ధిలింగం, నర్సింహ, సబ్ ఇంజినీర్లు మానస, ఉమ పాల్గొన్నారు.

అక్రమ ఫౌతీని రద్దు చేయాలంటూ కలెక్టరేట్ ఎదుట ధర్నా

కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సికిందర్‌నగర్ గ్రామస్తులు

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 2 : మోటకొండూరు మండల కేంద్రంలోని సికిందర్‌నగర్‌లో అక్రమ ఫౌతీని రద్దు చేసి అవినీతి అధికారులను శిక్షించాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు పెద్ద కోట్ల చిన్నయ్య, కొంతం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సికిందర్‌నగర్‌లోని 533 బీ సర్వే నెంబర్‌లో 8 ఎకరాల 28గంటల భూమిని 1987లో నలుగురు రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసి గ్రామస్తులకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించిందన్నారు. ఆ భూమిలో ప్రజల ఇండ్ల నిర్మాణం, కమ్యూనిటీ హాల్, ప్రకృతి వనం ఏర్పాటు కోసం ఎమ్మెల్యేతో గ్రామపంచాయతీ నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు గుర్తు చేశారు. ఆ సర్వే నెంబర్‌లోని షేక్ ఖాసీంబీ భర్త గఫార్ పేరు మీద ఉన్న 4ఎకరాల భూమిని తప్పుడు మరణ ధ్రువపత్రంతో స్థానికేతరులు తప్పుడు ఫౌతీ చేయించుకున్నారని తెలిపారు. దానిపై ఉన్నతాధికారులతో విచారణ జరిపించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పసల చిన్నయ్య, బాలస్వామి, పంతులు బాల, పెద్ద కోట్ల గోరింట, ఆరోగ్యమ్మ, నిర్మల, రాజ్యన్ పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ విధానం రద్దు చేయాలని నిరసన

రామన్నపేట, సెప్టెంబర్ 2 : ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేసి జీఓ 60 ప్రకారం జీతాలు చెల్లించాలని ఆరోగ్యశ్రీ సిబ్బంది కోరారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో 13వ రోజు నిరసనలో భాగంగా సోమవారం దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాడర్‌ను మార్చుతూ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా జీతాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మంద చంద్రయ్య, జాల సత్యనారాయణ, మహేందర్ పాల్గొన్నారు.

రైతు కుటుంబాల నిర్ధారణ పారదర్శకంగా చేపట్టాలి

మోత్కూరులో రైతు రుణమాఫీ సర్వే పత్రాలను స్వీకరిస్తున్న మండల నోడల్ అధికారి కీర్తి

త్కూరు, సెప్టెంబర్ 2 : రేషన్ కార్డులేక రుణమాఫీ నిలిచిపోయిన రైతుల వివరాల నమోదు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని మోత్కూరు ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ పేలపుడి వెంకటేశ్వర్లు అన్నారు. మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో రైతు కుటుంబాల నమోదు ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల దరఖాస్తులను పరిశీలించి మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా రైతు కుటుంబాల ప్రక్రియ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి కీర్తి, ఏఈఓలు ఎం.అశోక్, టి.గోపీనాథ్ పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సుల్లో నైపుణ్యం సాధించాలి

● కలెక్టర్ హనుమంతు కె.జెండగే

శిక్షణ కోర్సులు, వసతి సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 2 : వృత్తి విద్యా కోర్సులను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాభివృద్ధి సాధించాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థను సోమవారం ఆయన సందర్శించారు. వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల వసతి, భోజన సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం జూలూరు – రుద్రవెల్లి లో లెవెల్ బ్రిడ్జి వద్ద మూసీ వరద ఉధృతిని పరిశీలించారు. భారీ వర్షాలు ఉన్నందున బ్రిడ్జిలు, కల్వర్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. వరదలు ఎక్కువ ఉన్నందున బ్రిడ్జిపై ఎవరినీ అనుమతించవద్దని, చేపల వేటకు మత్స్యకారులను వెళ్లనివ్వవద్దని, బారీకేడింగ్ బందోబస్తుతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాగులు, వరదలు దగ్గరికి వెళ్లవద్దని, సెల్ఫీలు, ఫొటోలు తీసుకోవద్దని అన్నారు. ఆయన వెంట తాసీల్దార్ బేగంపేట శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ రాపర్తి భాస్కర్‌గౌడ్, ఎంపీఓ మజీద్, ఎంఆర్ఐలు వెంకట్‌రెడ్డి, నరసింహారెడ్డి ఉన్నారు.

రైతు కుటుంబ నిర్ధారణ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

● జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్

యాదగిరిగుట్ట : దాతారుపల్లిలో వరి పైరును పరిశీలిస్తున్న డీఏఓ గోపాల్

ఆలేరు రూరల్, సెప్టెంబర్ 2 : రైతుల కుటుంబాల నిర్ధారణ సర్వే పకడ్బందీగా చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ అన్నారు. మండలంలోని కొలనుపాకలో నిర్వహిస్తున్న సర్వేను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పంట రుణమాఫీ కాని రైతులకు త్వరలోనే మొబైల్ ప్రత్యేక యాప్ ద్వారా రుణమాఫీ అందిస్తామన్నారు. ఈ యాప్ ద్వారా కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి రుణమాఫీ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆయన వెంట ఏఈఓలు శివకుమార్, నాగార్జున ఉన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

యాదగిరిగుట్ట : భారీ వర్షాలు కురుస్తున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని డీఏఓ గోపాల్ సూచించారు. మండలంలోని దాతారుపల్లిలో వరి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వరి పొలంలో నుంచి మురుగు నీటిని తొలగించాలన్నారు. 50 రోజుల వయస్సు ఉన్న వరి నారు నాటాల్సి వస్తే ఆకు చివరలను తుంచి కుదురుకు 5నుంచి 6 మొక్కల చొప్పున పెట్టాలని సూచించారు. ఇప్పటి వరకు నార్లు పోయని రైతులు పొలంలో నేరుగా విత్తే పద్ధతి అవలంబించడం వల్ల సమయం, పెట్టుబడి ఆదా చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం రేషన్ కార్డు లేని రుణమాఫీ కాని రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ ప్రక్రియను పరిశీలించారు. ఆయన వెంట ఏఓ సుధారాణి, ఏఈఓ విరన్ కుమార్ ఉన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

● ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ యశోద

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందులను తనిఖీ చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ యశోద

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 2 : వర్షాలతో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ యశోద అన్నారు. పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆమె అకస్మికంగా సందర్శించి రోగులకు అందిస్తున్న సేవలు, ఎమర్జెన్సీ మందులను పరిశీలించారు. అనంతరం గూగుల్ మీట్ ద్వారా జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటు చేసి వారి పరిధిలో 24 గంటలూ ఎలాంటి అత్యవసర అవసరమున్నా సేవలు అందించుటకు సిద్ధంగా ఉంచామని తెలిపారు. డెంగ్యూ, మలేరియా నిర్ధారణ పరీక్ష కిట్లను అన్ని పీహెచ్‌సీల్లో, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఇండ్లల్లో నిరుపయోగంగా ఉన్న కవర్లు, పాత టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీదేవి, వైద్య సిబ్బంది ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా అదనపు పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ మనోహర్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రామకృష్ణ

రామన్నపేట : మనిపంపుల పీహెచ్‌సీలో రికార